
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్
5
మంగళవారం 16 ఏప్రిల్ 2024
జిల్లాల వార్తలు



కేసీఆర్ సమరశంఖం

నేడు సుల్తాన్‌పూర్‌లో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ

- బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి
- సాయంత్రం 5.30 గంటలకు గులాబీ బాస్ ప్రసంగం
- ఆరు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి జనసమీకరణ
- లక్షన్నర మందిని తరలించేందుకు సన్నాహాలు
- ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు



సుల్తాన్‌పూర్‌లోని సభ ప్రాంగణం



సుల్తాన్‌పూర్‌లోని ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణంలోని వేదిక

పుల్‌కల్, ఏప్రిల్ 15 : ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని జహీరాబాద్, మెదక్ లోక్‌సభ నియోజకవర్గాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన నాటి నుంచి గులాబీ నేతలు ప్రచారపర్వంలోకి దూకారు. అసెంబ్లీ సెగ్మెంట్లు, మండలాల వారీగా కార్యకర్తల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ సమాయత్తమవుతున్నారు. ఇక మరో రెండు రోజుల్లో నామినేషన్ల ఘట్టం ప్రారంభమవుతుండగా మంగళవారం బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను తలపెట్టింది. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారు సింగూరు చౌరస్తా వద్ద నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు పూర్తిచేశారు. గులాబీ బాస్ కేసీఆర్ ఈ వేదిక నుంచి ఎన్నికల ప్రచారానికి సమర శంఖం పూరించనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు కేసీఆర్ ప్రసంగించనున్నారు. మూడు రోజుల క్రితం చేవెళ్లలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభను నిర్వహించగా, సుల్తాన్‌పూర్ సభ రెండోవది.

ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లకు కేంద్రం..

ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లకు కేంద్రంగా ఉంటుందన్న ఉద్దేశంతో అందోలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సుల్తాన్‌పూర్ వద్ద సభ నిర్వహణకు స్థలాన్ని ఎంపిక చేశారు. ఇందుకోసం స్థానిక రైతులకు చెందిన 45 ఎకరాల పట్టా భూమిని గుర్తించారు. బహిరంగ సభ వేదిక, కళాకారుల వేదిక, జనం కూర్చునేందుకు వీలుగా గ్యాలరీల ఏర్పాటు, వాహనాల పార్కింగ్‌కు అవసరమైన స్థలాన్ని చదును చేసి పనులను వేగంగా పూర్తి చేశారు. లోక్‌సభ ఎన్నికల సభ కావడంతో సంబంధిత రైతుల వద్ద నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ)లపై సంతకాలు తీసుకున్నారు. జహీరాబాద్, మెదక్ లోక్‌సభ పరిధి లోకి వచ్చే నారాయణఖేడ్, అందోలు, జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేపట్టారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రజా ఆశీర్వాద సభ ద్వారా అధికార కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ఎదుర్కోవాలన్న కృతనిశ్చయంతో ఉన్న హరీశ్‌రావు భారీగా జన సమీకరణ చేయాలన్న పట్టుదలతో వారం రోజులుగా జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మెదక్ లోక్‌సభ అభ్యర్థి బి.వెంకట్రామారెడ్డిను వెంటబెట్టుకుని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. దాదాపు లక్షన్నర జనాన్ని తరలించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. సభ ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపి, ప్రత్యర్థి పార్టీలకు దీటైన సమాధానం చెప్పాలన్న పట్టుదలతో బీఆర్ఎస్ అధినాయకత్వం పనిచేస్తున్నది. జడ్పీ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తదితరులూ ఎప్పటికప్పుడూ సభా వేదిక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

విజయవంతం చేద్దాం

బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభను విజయవంతం చేయాలని జడ్పీ చైర్ పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పిలుపునిచ్చారు. సోమవారం వారు సుల్తాన్‌పూర్ వద్ద సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారీ జన సమీకరణతో ప్రతిపక్షాలకు దిమ్మదిరిగేలా సక్సెస్ చేయాలని కోరారు. రాష్ట్రంలో కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలన, కాంగ్రెస్ నాలుగు నెలల పాలన బేరీజు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్రస్వామి

కోదండరామాలయానికి

బ్రహ్మోత్సవ శోభ

మెదక్ అర్బన్, ఏప్రిల్ 15 : మెదక్ పట్టణంలోని కోదండ రామాలయంలో బ్రహ్మోత్సవాల్లో సోమవారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 20 వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ ప్రధాన అర్చకులు భాష్యం మధుసూదనచార్యులు ఆధ్వర్యంలో సాయంత్రం వాసుదేవ పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, రక్షాబంధనము, మృత్సంగ్రహణం, అంకురార్పణం పూజలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలను అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బండ నరేందర్ తెలిపారు. 47వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున సుప్రభాతం, భగవదారాధన, ప్రబంధ సేవాకాలం, బాలబోగము, అగ్ని ప్రతిష్ఠ, మూల మంత్రహవనము, ఆవాహిత దేవతా మంత్ర ధ్వజారోహణము, బలిహరణం, సాయంత్రం మహావిష్ణు సహస్రనామ పారాయణము, భేరీపూజ తదితర విశేష కార్యక్రమాలు జరుగునున్నాయి. 17న బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 10 గంటలకు స్వామి వారి ఎదుర్కోళ్లు, మధ్యాహ్నం 12 గంటలకు సీతారామ కల్యాణాన్ని వైవభోపేతంగా జరుపనున్నారు. అనంతరం దాదాపు అన్నదానం చేపడుతారు. 20న శనివారం ఉదయం మహాపూర్ణాహుతి, శతఘటాభిషేకం, అలంకరణ, రాత్రి 7 గంటలకు రథోత్సవం, రుత్విక సన్మానంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



విద్యుత్ దీపాలంకరణలో మెదక్ కోదండ రామాలయం

కారు దిగి హస్తం గూటికి..

- కాంగ్రెస్‌లో చేరిన నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి
- ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి కూడా
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి
- మెదక్ బల్దియాలో బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్



గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, హన్మంతరావు, మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు

నర్సాపూర్/మెదక్ మున్సిపాలిటీ/మెదక్, ఏప్రిల్ 15 : మెదక్ జిల్లాలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. పార్టీని వీడేందుకు సిద్ధమైన నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వందలాది మంది కార్యకర్తలతో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరి వెంట మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు తదితరులున్నారు. మదన్‌రెడ్డి వెంట పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షులు, మైనారిటీ రాష్ట్ర నాయకులు హబీబ్‌ఖాన్, గిరిజన మహిళ నాయకురాలు, ఎంపీటీసీ సంధ్యచత్రునాయక్, కొల్చారం మండల పరిషత్ ఉపాధ్యక్షులు అల్లు మల్లారెడ్డి, కొల్చారం ఎంపీటీసీ పల్వంచ అరుణ క్రిష్ణాగౌడ్, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ సావిత్రిరెడ్డి, మండల గౌడ సంఘం అధ్యక్షుడు వెంకట్ గౌడ్‌తో పాటు తాజా మాజీ సర్పంచులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు, వందలాది మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.



కాంగ్రెస్‌లో చేరిన చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్

మెదక్ మున్సిపల్ చైర్మన్, 9 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లోకి..

మెదక్ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి దెబ్బ తగిలింది. కీలక నేతలు కారు దిగి కాంగ్రెస్ చెంతకు చేరారు. చైర్మన్‌తో పాటు తొమ్మది మంది కౌన్సిలర్లు, ఓ కో ఆప్షన్ సభ్యుడు కారు దిగారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో సోమవారం గాంధీభవన్‌లో చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్లు రాగి వనజ, గోదల మానస, లక్ష్మీనారాయణగౌడ్, శంసున్నిసాబేగం, సమియొద్దీన్, బెండల నిర్మల, కొర్వి వేదవతి, బొద్దుగుల రుక్మిణి, యాదవ నర్మద, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఉమర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి కండువా కప్పారు. వీరితో పాటు మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, ఆత్మకమిటీ వైస్ చైర్మన్ పురం వెంకట నారాయణ, ఆర్యవైశ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తొడుపునూరి శివరామకృష్ణతో పాటు పట్టణ నేతలు బొద్దుగుల కృష్ణ, గోదల సాయిరాం, అంజద్, కొర్వి రాములు, బెండల నిఖిల్, శ్రీధర్‌యాదవ్‌లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా

ధాన్యం కొనుగోలు చేయాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

హత్నూర, ఏప్రిల్ 15: రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. మండల పరిధిలోని హత్నూర, చీక్‌మద్దూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సోమవారం కలెక్టర్ క్రాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తేమశాతం 17 ఉంటే ధాన్యాన్ని వెంటనే తూకం వేసి కొనుగోలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 211 కొనుగోలు కేంద్రాల ద్వారా లక్షా 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా.. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 08455-276155కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీసీవో తుమ్మ ప్రసాద్, పౌర సరఫరాల శాఖ డీ.ఎం కొండలరావు, డీఎస్‌వో వనజాక్షి, డీఈవో నరసింహారావు, జోగిపేట ఏడీఏ అరుణ, తదితరులు పాల్గొన్నారు.



చీక్‌మద్దూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15 : అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో కరపత్రాలు, వాల్ పోస్టర్లను కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార, ప్రజా సంబంధిత ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 14 నుంచి 20 వరకు వారం రోజుల పాటు నిర్వహించనున్న వారోత్సవాల ద్వారా అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ మనోజ్, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఏడీఎఫ్‌వో సుధాకర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాలోకి ధాన్యం కొనుగోలు నగదు

మెదక్, ఏప్రిల్ 15 : ధాన్యం కొనుగోలు చెల్లింపులపై సంబంధిత పౌరసరఫరాల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి 108 మెట్రిక్ టన్నులను సేకరించినట్లు తెలిపారు. 14 మంది రైతులకు రూ.24.05 లక్షలను వారి బ్యాంకు ఖాతాలో జమచేశామని పేర్కొన్నారు. మిల్లులకు ధాన్యం తరలింపులో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులతో సమన్వయం చేసుకుని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతులు ఒకేసారి మూకుమ్మడిగా ధాన్యాన్ని మార్కెట్ తీసుకురాకుండా దశల వారీగా వచ్చేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అధికారులు జారీచేసిన ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాసుబుక్ మొదటి రెండు పేజీలు, ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ పత్రాలను రైతులు తమ వెంట తెచ్చుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసర అధికారులు బ్రహ్మరావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి దుస్తులు కొనేందుకు వెళ్తుండగా ప్రమాదం..

వధువు సోదరుడి మృతి

- ట్రాలీ ఆటోను ఢీకొట్టిన కారు
- పలువురికి గాయాలు



అఖిల్ మృతదేహం

తూప్రాన్, ఏప్రిల్ 15 : పెళ్లి భాజాలు మోగాల్సిన ఇంటా చావు డప్పు మోగింది. పెళ్లికి నూతన వస్త్రాలను కొనేందుకు వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వధువు సోదరుడు మృతిచెందిన సంఘటన సోమవారం తూప్రాన్ పట్టణంలో చోటుచేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. మెదక్ జిల్లా మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన అంబర్‌పేట యాదగిరి కుమార్తె శ్రావణి వివాహం నిశ్చయమైంది. పెళ్లి దుస్తులను కొనుగోలు చేసేందుకు యాదగిరి తమ్ముడు అంబర్‌పేట బాలకృష్ణకు చెందిన ట్రాలీ ఆటోలో కుటుంబీకులు తూప్రాన్ పట్టణానికి బయలుదేరారు. తూప్రాన్ పట్టణ శివారులోని హల్దీవాగు వద్దకు రాగానే జాతీయ రహదారిపై వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు వీరి ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. ట్రాలీ కుదుపునకు గురికాగా, అందులో కూర్చున అందరూ కిందపడ్డారు. యాదగిరి కుమారుడు అఖిల్(15) తలమీదుగా కారు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అఖిల్ ఇటీవల పదో తరగతి పరీక్షలను రాశాడు. అంబర్‌పేట యాదగిరి, భార్య మంజుల, పెళ్లి కుమార్తె శ్రావణి, అంబర్‌పేట బాలకృష్ణ, ఆయన భార్య రాధ, కుమారుడు అరవింద్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

డబ్బే..డబ్బు

- మాజీ ఎమ్మెల్యే కారులో రూ.లక్షా 80 వేలు
- మరోచోట రూ.లక్ష
- ఆర్టీసీ బస్సులో రూ.లక్ష

7లో

కౌంట్‌డౌన్



- 18న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్
- ఆ రోజు నుంచే నామినేషన్ల స్వీకరణ
- 29 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- ప్రధాన పార్టీ శ్రేణుల్లో కదనోత్సాహం
- ఇక హోరెత్తనున్న ప్రచారం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 15 : పార్లమెంట్ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలు కానున్నది. కేంద్ర ఎన్నికల సంఘం గత నెల 16న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించగా ఆ రోజు నుంచి ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. మరో రెండు రోజుల్లో విడుదల చేయనున్న నోటిఫికేషన్‌తో ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. దీంతో ప్రచార భేరి ఊపందుకోనున్నది.

రిటర్నింగ్ అధికారుల నుంచి నోటిఫికేషన్లు

18న ఉదయమే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికి మెదక్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ నోటిఫికేషన్ జారీ చేస్తారు. అలాగే జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంగారెడ్డి కలెక్టర్, రిటర్నింగ్ అధికారి వల్లూరి క్రాంతి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. 18వ తేదీ నుంచి 29వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనున్నది. 25న నామినేషన్ల స్వీకరణ ముగియనున్నది. 26న స్క్రూటీని నిర్వహిస్తారు. ఈ నెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. మే 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనున్నది.

ఇక సమరమే..

మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థిత్వాలు ముందుగానే ఖరారవడంతో వారు పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశాలను నిర్వహించి కదనోత్సాహాన్ని నింపారు. నాయకులు, కార్యకర్తలను సమాయత్తపరిచారు. ఇంతవరకు పార్టీ శ్రేణులను సమన్వయపరుచుకున్న అభ్యర్థులు.. నామినేషన్ల పర్వం నుంచి ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. కాంగ్రెస్ తరఫున మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యులతో సమావేశమయ్యారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ తరఫున రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధుల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీ సెగ్మెంట్లు, మండల స్థాయిలోనూ నాయకుల, కార్యకర్తల సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. రెండు నియోజకవర్గాలకు కలిపి మంగళవారం ప్రజా ఆశీర్వాద బహిరంగ సభను తలపెట్టింది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాల్గొని ప్రచార భేరిని ప్రారంభించనున్నారు. ఇక అందరి కంటే ముందే ఖరారైన బీజేపీ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. మెదక్ లోక్‌సభ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు అయితే నియోజకవర్గమంతటా విస్తృతంగా పర్యటిస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ, జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లు, మండలస్థాయి సమావేశాలతో కార్యకర్తలు, నాయకులతో మమేకమవుతున్నారు. మొత్తానికి నోటిఫికేషన్‌కు ముందు అన్ని కసరత్తులు పూర్తిచేసుకుని, తమ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ల నాటి నుంచి ఎన్నికల కదనరంగంలో ప్రచారాన్ని హోరెత్తించనున్నారు.

భక్తిశ్రద్ధలతో రథ శిఖర స్థాపన

జోగిపేట, ఏప్రిల్ 15: ప్రఖ్యాతిగాంచిన జోగినాథస్వామి రథోత్సవానికిగాను సోమవారం రథ శిఖర స్థాపన జరిపారు. ఈనెల 18న రథోత్సవం జరుగనున్న నేపథ్యంలో ఆలయ పూజరులు మందుప్పటి భద్రయ్యస్వామి, సుజీత్‌స్వామి రథోత్సవ కమిటీ చైర్మన్ శంకర్‌తో రథంపైన అమర్చే శిఖరాలు (ఇత్తడి గోళాలు)కు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆ గోళాలను ఆనవాయితీ ప్రకారం తాపీమేస్త్రీలు భక్తిశ్రద్ధలతో తలపైనెత్తుకుని మేళతాళాల మధ్య రథం వద్దకు తోడుకుని వచ్చారు.

భారత్ గ్యాస్ ఏజెన్సీ రికార్డులు పరిశీలించిన డీసీఎస్‌వో

రాయపోల్, ఏప్రిల్ 15: రాయపోల్ భారత్ గ్యాస్ గోదాంలో డొమెస్టిక్ సిలిండర్ల నుంచి కమర్షియల్ సిలిండర్లలోకి గ్యాస్‌ను రీఫిల్ చేస్తుండగా పోలీసులు ఆదివారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం తెలిసిందే. సోమవారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ రాయపోల్ భారత్ గ్యాస్ గోదాం, కార్యాలయంలో తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి మాట్లాడారు. రాయపోల్ భారత్ గ్యాస్ గోదాంలో నిబంధనలకు విరుద్ధంగా వంట గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్లలోకి రీఫిల్ చేసి హైదరాబాద్‌లోని వ్యాపార, వాణిజ్య సంస్థలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదు రావడంతో తనిఖీ చేపట్టామని పేర్కొన్నారు. తనిఖీల్లో 11 నిండుగా ఉన్న కమర్షియల్ సిలిండర్లు, 64 సగం నింపిన కమర్షియల్ సిలిండర్లు లభించాయని వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే 561 వంట గ్యాస్ సిలిండర్లను కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే సంబంధిత గ్యాస్ కంపెనీ వారికి కూడా సమాచారం ఇస్తామని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఎవరైనా గ్యాస్ అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట డీటీలు రాజిరెడ్డి, లావణ్య ఉన్నారు. ఇదిలా ఉండగా రాయపోల్ భారత్ గ్యాస్ గోదాంలో జరిగిన అక్రమాలకు సంబంధించి ఏజెన్సీ యజమానిని వివరణ కోరగా.. తనకు తెలియకుండానే సిబ్బంది ఇలా చేశారని చెప్పడంతో.. ఇద్దరు డెలివరీ బాయ్స్‌పై కేసు నమోదు చేశామని డీసీఎస్‌వో పేర్కొన్నారు. ఇంత పెద్ద కుంభకోణం ఏజెన్సీ యజమానికి తెలియకుండా జరగడం అసాధ్యమని వినియోగదారులు పేర్కొంటున్నారు.

ఆరోగ్య కార్యక్రమాల్లో సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలి

● సిద్దిపేట జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో పుట్ల శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 15: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే అన్ని ఆరోగ్య కార్యక్రమాలలో, ప్రతి బుధవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో తప్పనిసరిగా వైద్యులు, సిబ్బంది పాల్గొనాలని సిద్దిపేట డీఎంఅండ్‌హెచ్‌వో పుట్ల శ్రీనివాస్ సూచించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సీనియర్ నర్సింగ్, అధికారులు, స్టాఫ్‌నర్సులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల పరీక్షలు మొదలు, సుఖ ప్రసవం జరిగేలా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు నిర్వహించాలని తెలిపారు. మాతృ, శిశు మరణాలు సంభవించకుండా చూడాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ప్రజలను ఆప్యాయంగా ఆహ్వానించాలన్నారు. వారికి కావలసిన ఆరోగ్య సేవలను సమయం లోపల అందించాలని, గర్భిణుల దగ్గరి నుంచి ప్రసవాల సంఖ్యకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఎంసీహెచ్ పోర్టల్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు చూసుకోవాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారికి, క్షయవ్యాధి, డయాబెటిస్, హైపర్ టెన్షన్, బీపీ, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, ఆరోగ్య పరీక్షలు, ఫాలో కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వైద్యులు, అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, డాక్టర్ వినోద్ బాబ్జి, డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ విజయరాణి, డాక్టర్ రజిని, డాక్టర్ శ్రీదేవి, శ్రీనివాస్‌రెడ్డి, ఏవో, డీపీహెచ్‌ఎన్‌వోఎస్ మేరీ, డెమో నవీన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన పార్టీలకు దీటుగా పోటీ ఇస్తా..

● జహీరాబాద్ పార్లమెంట్ బరిలో ఎన్ఆర్ఐ గుర్రపు మచ్చేందర్



సిర్గాపూర్ మండంలంలోని బొక్కస్‌గామ్‌లో ప్రచారం చేస్తున్న మచ్చేందర్

కల్హేర్, ఏప్రిల్ 15: జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న తాను ప్రధాన పార్టీలకు దీటుగా పోటీ ఇవ్వనున్నట్లు కల్హేర్ మండలంలోని మార్డి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గుర్రపు మచ్చేందర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన కల్హేర్ మండలంలోని ఫత్తేపూర్, బీబీపేట్, సిర్గాపూర్ మండలంలోని పోచాపూర్, గోసాయిపల్లి, బొక్కస్‌గామ్ తదితర గ్రామాల్లో ప్రజలను కలిసి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కరించేందుకు ఎంపీగా పోటీ చేస్తున్నానని, దీనివల్ల తనకు గుర్తింపు లభించడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరగా చూసే అవకాశముంటుందన్నారు. 10 ఏళ్లగా బీబీ పాటిల్, ఐదేళ్లగా సురేష్‌షెట్కార్ ఎంపీగా ఉండి ఈ ప్రాంతానికి ఏమి చేశారని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను జహీరాబాద్ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, అభిపవార్, ప్రభుపటేల్, మల్లేష్, రవి పాల్గొన్నారు.



ఒగ్గుడోలు శిక్షణను పొందుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



శ్రీకృష్ణ అవతారం విన్యాసంలో విద్యార్థులు

డిల్లెం.. బల్లెం..

- ఒగ్గుడోలుకు గత వైభవం
- సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక శిక్షణా తరగతులు పూర్తి
- అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు సైతం..
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



శివముద్ర విన్యాసంలో విద్యార్థులు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 15: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒగ్గు నృత్యానికి గత వైభవాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో చుక్క సత్తయ్య మనుమడు ఒగ్గు రవి ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి ఒగ్గుడోలు శిక్షణను 15 వరకు కొనసాగింది. ప్రతిరోజు 5 గంటల వరకు శిక్షణను అందించారు. ఈ శిక్షణకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న ఎన్‌సీసీ విద్యార్థులు ఎక్కువ ఆసక్తి కనబరిచారు. తెలంగాణ ప్రధాన జానపద వృత్తి కళారూపం ఒగ్గుడోలు నృత్యం. గొల్ల కురుమల ఆరాధ్య దైవమైన మల్లన్నను కొలిచేందుకు ఉద్దేశించిన ఒగ్గుడోలు కాలక్రమేణా భక్తికి వినోదాన్ని జోడించి వేదికలకు ఎక్కించారు. తాత, ముత్తాతల నుంచి అందించబడుతున్న ఈ ఒగ్గుడోలు నృత్యం నిత్య ప్రక్రియగా



నరసింహ అవతారం విన్యాసం నేర్చుకుంటున్న విద్యార్థులు

మారింది. ఒగ్గుడోలు నృత్యంలో చాలామంది పెద్దలు కష్టపడినప్పటికీ డాక్టర్ చుక్క సత్తయ్య, మిద్దె రాములు కృషి మరువలేనిది. వీరిద్దరూ ఒగ్గుడోలు నృత్యానికి సూర్యచంద్రులాంటి వారిని అందరూ అంటుంటారు. డాక్టర్ చుక్క సత్తయ్య మనవడు డాక్టర్ ఒగ్గు రవి అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు కూడా ఈ ఒగ్గుడోలు శిక్షణను అందించాడు.

21 రోజులు పాటు శిక్షణ

గతకాలంలో ఒగ్గుడోలు నిపుణులు 41 రోజుల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటలలోపు శిక్షణ పూర్తి చేసేవారు. ప్రస్తుతం ఒగ్గు రవి ఆధ్వర్యంలో 21 రోజులపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణను అందించారు. ఉదయం పూట రెక్కలగూడెం, శివయ్య ముద్ర, శ్రీకృష్ణ అవతారం, నరసింహావతారం, శిశువుల కరణం, శ్రీశైల పర్వతం, రత్నం ఒకటి, రెండు, దుమ్మి దొమ్మరి గడ్డ, నీలువు దొమ్మరి గడ్డ, కోడెల స్తంభం విన్యాసాలు నేర్పించారు. అడుగులు, దరువులలో ఆదిసరుపు, బిళ్లం, జోగు, కడెం, ముందడుగు, జాడియా లక్ష్మి లాంటివి 12 విన్యాసాలు శిక్షణలో నేర్పించారు. మధ్యాహం నుంచి సాయంత్రం వరకు తరగతి గదుల్లో మానవతా విలువలు, క్రమశిక్షణ, తల్లి దండ్రులపై ప్రేమ, రామాయణం, మహాభారతం నీతి, నియమాలు, భారతీయ సంస్కృతిపై ప్రేమ లాంటివి విద్యార్థులకు శిక్షణ అందించారు.

ఒగ్గుడోలు నృత్యాన్ని భవిష్యత్ తరాలకు అందిస్తాం



ఒగ్గుడోలు నృత్యాన్ని కొన్నేళ్లుగా తెలంగాణలో కాకుండా ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయాలని ప్రయత్నం చేస్తున్నాను. ఒగ్గుడోలు నృత్యాన్ని పరిచయం చేసిన వ్యక్తి మా తాత చుక్క సత్తయ్య, అతని మనువడిగా ఈ నృత్యాన్ని వందల మందికి శిక్షణ ఇవ్వాలని నేను నిర్ణయించుకున్నాను. చుక్క సత్తయ్య, మిద్దె రాములు ఇద్దరూ ఒగ్గు నృత్యానికి సూర్యచంద్రులు లాంటివారు. ఈ క్రమంలో మా తాత చెప్పిన ప్రకారం నేను శిక్షణ పూర్తి చేసుకుని తెలంగాణకే పరిమితమైన ఈ ఒగ్గుడోలు నృత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయాలనే ఉద్దేశంతో శిక్షణ ప్రారంభించాను. ఇప్పటికీ తెలంగాణలో 51 కేంద్రాల్లో ఒగ్గుడోలు శిక్షణ అందించాం. ఇతర రాష్ట్రాల్లో కూడా కలెక్టర్ ట్రైనింగ్‌లో ఒగ్గుడోలు శిక్షణను అందించాను.

- ఒగ్గుడోలు రవి, ప్రధాన శిక్షకుడు

ఒగ్గు శిక్షణ చాలా బాగుంది



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒగ్గుడోలు శిక్షణ చాలా బాగుంది. అంతరించిపోతున్న కళ నేర్చుకోవడం నేను అదృష్టంగా భావిస్తున్నాను. ఒగ్గుడోలు అంటే ఎవరికీ తెలియదు. అలాంటిది నేర్చుకోవడం చాలా సంతోషం. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో శిక్షణకు హాజరవుతాం. మా శిక్షకుడు ఒగ్గు రవి చాలా అద్భుతంగా శిక్షణ ఇస్తున్నాడు.

- నరేందర్, పెద్ద చెప్యాల, బీకాం కంప్యూటర్స్ ఫస్ట్ ఇయర్

ఒగ్గుడోలు శిక్షణ తీసుకోవడం మా అదృష్టం



ఒగ్గుడోలు జానపద నృత్యం తెలంగాణకు పరిమితం కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదగడానికి కృషిచేస్తాం. ఒగ్గుడోలు అంతరించిపోకుండా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇస్తున్నారు. ఇంత మంచి శిక్షణ తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా.

- వంశీ, దానంపల్లి, బీజెడ్‌పీ ఫస్ట్ ఇయర్

ముగిసిన శిక్షణ

రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో, చండీశ్వర ఒగ్గు కళాసేవా సమితి మాణిక్యపురం వారు సంయుక్తంగా పదిరోజులుగా నిర్వహిస్తున్న ఒగ్గుడోలు శిక్షణ కార్యక్రమం సోమవారం తెలుగు శాఖా అధ్యక్షుడు ఎస్.మహేందర్ అధ్యక్షతన ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఒగ్గు బీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒగ్గు ధర్మయ్య మాట్లాడుతూ.. చుక్కా రవి ఇప్పటివరకు వివిధ శిబిరాలలో అబ్బాయిలకు మాత్రమే ఒగ్గు డోలును నేర్పించారు. కానీ మొదటి సారిగా కళాశాల స్థాయిలో అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు ఒగ్గు డోలు నేర్పించడం గొప్పగా ఉన్నదన్నారు.

సంగారెడ్డి జిల్లా ట్రైనింగ్ కలెక్టర్‌గా మనోజ్



కలెక్టర్ క్రాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రైనింగ్ కలెక్టర్ మనోజ్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15: తెలంగాణకు కేటాయించిన 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన మనోజ్ సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం ట్రైనింగ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతికి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

దేశంలో నియంతృత్వ పాలన

- రాజకీయాల్లోకి గుండాలు.. హంతకులు
- ఫోన్ ట్యాపింగ్ దుర్మార్గపు చర్య.. బాధ్యులెవరైనా శిక్షార్హులే
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 15: దేశంలో నియంతృత్వ పాలన సాగుతోందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఆలోచనతో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం పని చేసే పార్టీలను ఎన్నుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవనంలో చాడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుండాలు, హంతకులు, నేరచరిత్ర కలిగిన వారు, వ్యాపారులు, ధనవంతులు ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయడంతో రాజకీయాలకు విలువలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీజేపీ పాలనలో మోదీ ఇచ్చిన హామీల్లో కనీసం ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. జన్‌ధన్ ఖాతాల వల్ల ఒక్క పేదవాడికైనా మేలు జరిగిందా అని ప్రశ్నించారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచిపోషించినంతగా, పేదల సమస్యలు తీర్చలేని బీజేపీని, ఈ ఎన్నికల్లో గద్దెదించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. వామపక్షాలను అంతం చేయాలన్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాదించలేకపోయాయన్నారు. ఇందుకు మునుగోడు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కృషిచేసిన వామపక్షాలను కేసీఆర్ తొక్కిపడేయాలన్న అహంకారాన్ని తదుపరి జరిగిన ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ప్రస్తుతం కేసీఆర్ ఏ పరిస్థితుల్లో ఉన్నాడో ఆయా పార్టీలు గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. తెలంగాణలో కాంగ్రెస్ వందరోజుల పరిపాలన ప్రజా ఆకాంక్షల వైపు పయనిస్తోందని, ఇదే పాలన చివరి వరకు ఇచ్చిన వాగ్దానాలు పరిపూర్ణం చేసేందుకు పనిచేస్తుందని ఆశిస్తున్నామన్నారు. సీపీఐ పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమితో కలిసి పనిచేస్తుందన్నారు. తెలంగాణలో 5 పార్లమెంట్ సీట్లు ఇవ్వాలని కోరామని, కనీసం ఒక్క సీటైనా ఇవ్వాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ అధిష్టానంతో చర్చిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశం, ఎడల వనేష్, సంజీవరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ రూ.4వేలు ఇవ్వని రేవంత్... రూ.4 లక్షల జీతం తీసుకుంటుండు

- నాలుగు నెలల్లో ప్రజలకు శఠగోపం పెట్టాడు
- 400 సీట్లలో మెదక్ పార్లమెంట్ సీటు ఉండాలి
- బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు



గజ్వేల్‌లో నిర్వహించిన రోడ్‌షోలో రఘునందన్‌రావు

గజ్వేల్, ఏప్రిల్ 15: డిసెంబరు 9 నుంచి అవ్వ, తాతలకు రూ.4వేల పింఛన్ ఇస్తానని చెప్పిన రేవంత్ ప్రజలకు శఠగోపం పెట్టారని, ఆయన మాత్రం రూ.4 లక్షల జీతాన్ని తీసుకుంటున్నారని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఆయన సోమవారం రోడ్ షోను నిర్వహించి మాట్లాడారు. ఎన్నో హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి నాలుగు నెలల్లో ప్రజలకు నీళ్లు, కరెంట్, పింఛన్ ఇవ్వడం లేదని, డిసెంబరు 9న రూ.2 లక్షలు మాఫీ చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఢిల్లీకి తిరుగుతున్నాడు కానీ, రుణ మాఫీ చేయడం లేదన్నారు. కేసీఆర్‌ను ఇంటికి పంపాలన్న ఉద్దేశంతోనే ప్రజలు రేవంత్‌రెడ్డికి ఓటు వేశారని, ఇక ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్ ఏనాడైనా గజ్వేల్ ప్రజలకు కలిశారా అని ప్రశ్నించారు. గజ్వేల్ పట్టణంలో నిరుపేదలకు ఇస్తానన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన వ్యక్తి ఇంట్లో 30 బెడ్‌రూం ఇళ్లు ఉన్నాయని చెబుతున్నారని, కానీ ఇక్కడ గరీబోళ్లకు మాత్రం ఇవ్వలేదన్నారు. 400 సీట్లతో మూడోసారి మోదీ ప్రధాని కానున్నాడని, 400 సీట్లలో మెదక్ ఉండాలని కోరారు. సీనియర్ నాయకులు జశ్వంత్‌రెడ్డి, టేకులపల్లి రాంరెడ్డి, సింగం సత్తయ్య, నందన్‌గౌడ్, ఎల్కంటి సురేశ్, కమ్మరి శ్రీనివాస్, మహేశ్, నేమూరి ఆంజనేయులుగౌడ్, నత్తి శివకుమార్ ఉన్నారు.

వెంకట్రామారెడ్డిపై కేసెందుకు పెట్టలేదు..

తూప్రాన్, ఏప్రిల్ 15: అసెంబ్లీ ఎన్నికల సమయంలో డబ్బులు రవాణా చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిపై ఎందుకు కేసు పెట్టడం లేదని, అరెస్టు చేయడం లేదని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు ప్రశ్నించారు. తూప్రాన్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో పోలీసు వాహనాల్లో డబ్బులు తీసుకెళ్లినట్లు తాను ఆరోపించడం లేదని, రాధాకిషన్‌రావే చెప్పారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి వియ్యంకుడు కావడం వల్ల.. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పైరవీతో వెంకట్రామారెడ్డిని కాపాడుతున్నారా అని ప్రశ్నించారు.

ప్రమాదవశాత్తు పగిలిన బస్సు టైర్


● తప్పిన ప్రమాదం..

ఊపిరిపీల్చుకున్న ప్రయాణికులు

మునిపల్లి, ఏప్రిల్ 15: జహీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ (పల్లె వెలుగు) బస్సు సంగారెడ్డి నుంచి జహీరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు టైర్ పగిలింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ రోడ్డు పక్కకు ఆపి ప్రయాణికులను కిందకు దింపాడు. ఈ ఘటన మునిపల్లి మండలం (ముంబాయి జాతీయ రహదారి) బుదేరా చౌరస్తా సమీపంలో గల మహిళా డిగ్రీ కళాశాల ఎదుట సోమవారం జరిగింది. ఈ ఘటనతో బస్సులోని ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం కొందరు ప్రయాణికులు ఆటోలో వెళ్లగా.. మరికొందరిని కండక్టర్ ఎక్స్‌ప్రెస్ బస్సు ఆపి పంపించారు.

డబ్బే..డబ్బు..

- మాజీ ఎమ్మెల్యే కారులో రూ.1.80 లక్షలు
- ఆర్టీసీ బస్సులో మరో రూ.లక్ష



పోచమ్మరాల్ చెక్‌పోస్టు వద్ద మాజీ ఎమ్మెల్యే కారులో నగదు స్వాధీనం చేసుకున్న ఎస్ఐ ఆనంద్‌గౌడ్

హవేళిఘణపూర్/పెద్దశంకరంపేట/తూప్రాన్, ఏప్రిల్ 15: మెదక్ జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో డబ్బు పట్టుపడుతోంది. హవేళిఘణపూర్ మండలంలోని పోచమ్మరాల్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే వాహనంలో రూ.1.80 లక్షలు పట్టుబడ్డాయి. ఆ డబ్బులకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న నితిన్‌రెడ్డి, మనోజ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అలాగే, 161వ జాతీయ రహదారిపై పెద్దశంకరంపేట మండల పరిధిలోని కోలపల్లి చెక్‌పోస్టు వద్ద సోమవారం మహారాష్ట్రలోని దెగ్లూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనంలో రూ.లక్ష నగదును ఎస్ఐ పట్టుకున్నారు. ఇక తూప్రాన్ పట్టణ శివారులోని నాగులపల్లి చౌరస్తా వద్ద సోమవారం రాత్రి ఆర్టీసీ బస్సులో నిర్వహించిన తనిఖీలో రూ.లక్ష పట్టుకున్నట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపారు. కామారెడ్డి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సును తనిఖీ చేశారు. కామారెడ్డి నుంచి ఉప్పల్ వెళ్తున్న ఉప్పల్‌కు చెందిన ఎలుక శ్యామల వద్ద రూ.లక్ష లభించినట్లు వివరించారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో సీజ్ చేసినట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి: ఎస్పీ



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న మెదక్ ఎస్పీ

మెదక్ అర్బన్, ఏప్రిల్ 15: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ బాలస్వామి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు.

గ్రంథాలయ పాఠకులకు అండగా ఎస్పీ



జిల్లా కేంద్ర గ్రంథాలయానికి చైర్లు, స్టడీ ప్యాడ్ తదితర సామగ్రిని అందజేస్తున్న పట్టణ సీఐ భాస్కర్

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 15: సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇచ్చిన హామీ మేరకు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట నిలుపుకున్నారు. పక్షం రోజుల క్రితం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. అక్కడ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వాటర్ డిస్పెన్సరీ, స్టడీ చైర్లు, స్టడీ ప్యాడ్స్ కొరత ఉందని, వాటిని సమకూర్చాలని అభ్యర్థులు చేసిన విన్నపం మేరకు పట్టణ సీఐ ఎస్ భాస్కర్ ద్వారా సోమవారం వాటిని అందజేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ భాస్కర్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వసుందర, డిప్యూటీ లైబ్రేరియన్ వంశీకృష్ణ, అసిస్టెంట్ లైబ్రేరియన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 15: ఫార్మసిస్టుల సంక్షేమసంఘం సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడిగా పెద్దకాపు విష్ణువర్ధన్‌రెడ్డిని నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

భద్రాద్రి తలంబ్రాల బుకింగ్

నారాయణఖేడ్, ఏప్రిల్ 15: భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను ఇంటి వద్దకు చేర్చే కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఖేడ్ పట్టణంలో సోమవారం దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, వైద్యశాలల్లో అవగాహన కల్పిస్తూ ముమ్మరంగా బుకింగ్‌లు చేపట్టారు. ఖేడ్ ఆర్టీసీ డిపో మార్కెటింగ్ సేల్స్ ఇన్‌చార్జి పాండు అవగాహన కల్పించి బుకింగ్ చేయించి రశీదులను అందజేశారు. ఖేడ్ ప్రాంత భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు గాను 9441071134, 9959223170, 9989032336 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

● జహీరాబాద్ / ఝరాసంగం: భద్రాద్రి సీతారాముల కల్యాణతలంబ్రాలను ఇంటివద్దకు పంపించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసిందని డిపో మేనేజరు సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వరకు బుకింగ్ చేయనున్నట్టు వివరించారు. ప్రజలు, భక్తుల సౌకర్యార్థం నియోజకవర్గంలోని మండలాల వారిగా అధికారులను ఏర్పాటు చేసుకుని తలంబ్రాలు బుకింగ్ చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా సోమవారం ఝరాసంగం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు తలంబ్రాలు బుకింగ్ చేసుకున్నారు. మరిన్ని వివరాలకు 9154298657 నెంబరుకు సంప్రదించాలని సూచించారు.

సొంత డబ్బుతో ట్రైసైకిల్ అందజేత

శివ్వంపేట, ఏప్రిల్ 15: రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడైన ఓ వ్యక్తికి శివ్వంపేట జడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా తన సొంత డబ్బుతో సోమవారం ట్రైసైకిల్ కొనుగోలు చేసి అందచేశాడు. రత్నాపూర్ గ్రామానికి చెందిన ఆవులసత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలు పనిచేయకుండా అయింది.

బస్సు సౌకర్యం కల్పించండి

రాయికోడ్, ఏప్రిల్ 15: మండలంలోని మాటూరు కాజమాల్పూర్ నాగ్వార్ కుసునూరు గ్రామాలకు ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నామని, ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సింగూరు రోడ్డు పనులకు మోక్షమెన్నడో?

● రూ.2.50 కోట్ల వ్యయంతో 6 కిలోమీటర్ల పనులు ప్రారంభం ● అర్ధాంతరంగా ఆపేసిన కాంట్రాక్టర్ ● 7 నెలలుగా ఇక్కట్లు



కంకర తేలి గుంతలమయంగా మారిన రోడ్డు

మునిపల్లి , ఏప్రిల్ 15: మండల కేంద్రమైన మునిపల్లి చౌరస్తా సమీపం నుంచి (సింగూరు రోడ్డు) బుసారెడ్డిపల్లి గ్రామ శివారు వరకు సింగూరు రోడ్డు పనులను ప్రారంభించి 7 నెలలు గడిచినా పురోగతి లేక పనులు అర్ధాంతరంగా ఆపేశారు. మండలంలోని నాలుగైదు గ్రామాలకు వెళ్లాలంటే ఇదే ప్రధానరోడ్డు కావడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మునిపల్లి చౌరస్తా సమీపం నుంచి బుసారెడ్డిపల్లి గ్రామ శివారు వరకు గల దాదాపు 6 కి.మీ. మే సింగూరు రోడ్డు పనులను రూ. 2.50కోట్ల నిధుల వ్యయంతో గత ఏడాది సెప్టెంబర్ 10న అప్పటి ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రారంభించారు. అయితే పనుల్లో భాగంగా రోడ్డును అప్పట్లో తవ్వారు కాని పనులు మాత్రం కొనసాగడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా పరిణమించింది. అప్పటి కాంట్రాక్టర్ పనులను సబ్ కాంట్రాక్టర్‌కు అప్పగించగా దాదాపు నాలుగైదు రోజులపాటు రోడ్డు తవ్వకం పనులు సాగినా ఆ తర్వాత పూర్తిగా పనులను ఆపేశారు. శాసనసభ ఎన్నికలకు ముందు ప్రారంభించిన పనులు నెలలు గడుస్తున్నా ఏమాత్రం పురోగతి లేకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. కాగా మండలంలోని మల్లికార్జున్‌పల్లి, మల్లారెడ్డిపేట, బుసారెడ్డిపల్లి, సింగూరు ప్రాజెక్టు, జోగిపేట తదితర గ్రామాలకు వెళ్లాలంటే ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉంటుంది. వెళ్లాలి. కాని ఈ రోడ్డు పనులు నిలిచిపోవడంతో తవ్విన రోడ్డు కంకర తేలింది. దీంతో సింగూరు రోడ్డు అంటేనే వాహనదారులు, ప్రయాణికులు జంకే పరిస్థితి నెలకొన్నది. రోడ్డు ఇలా ఉంటే నడిచేదెట్ల అంటూ పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా నిలిచిపోయిన సింగూరు రోడ్డు పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం

సింగూరు రోడ్డుకు సంబంధించిన పనులను కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాడు. వారు పనులు ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేశారు. ఈ విషయాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

- మధూకర్, పీఆర్ ఏఈ

మనూరులో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

మనూరు, ఏప్రిల్ 15: మండల కేంద్రమైన మనూరులో సోమవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాల్ జొన్నలకు ధర రూ.3,180 ప్రకటించిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పంటకు మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కల్వకుంటలో ఇసుక డంప్‌లు సీజ్



ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

నిజాంపేట, ఏప్రిల్ 15: 'నిజాంపేటలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా' అనే శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. కొంత కొంతకాలంగా అక్రమాలకు పాల్పడుతున్న ఇసుక తవ్వకాలపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. సోమవారం రెవెన్యూ అధికారులు కల్వకుంట గ్రామ శివారులో నిల్వ ఉంచిన దంపును పరిశీలించి ఇసుక డంప్‌లను సీజ్ చేశారు.

అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలు ధ్వంసం

● వెంకటాపూర్‌లో ఉద్రిక్తత ● రామాయంపేట-దౌల్తాబాద్ రోడ్డుపై కంచె వేసి దళితుల రాస్తారోకో



చూపుడు వేలును ధ్వంసం చేసిన దృశ్యం, పోలీసులతో గొడవ పడుతున్న ఆందోళనకారులు

రామాయంపేట, ఏప్రిల్ 15: రామాయంపేట మండల పరిధి వెంకటాపూర్‌లో అంబేడ్కర్ జయంతి రోజున అర్ధరాత్రి అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలును కొందరు ధ్వంసం చేశారు. కొన్ని రోజుల క్రితం విగ్రహాన్ని ప్రతిష్ఠించే విషయమై గ్రామంలో ఇరువర్గాల మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో దళితులను అవమానించే విధంగా జరిగిన ఘటనతో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. స్థానిక బస్ స్టాండ్ ప్రదేశంలో విగ్రహ ప్రతిష్ఠ విషయంలో గొడవలు చోటు చేసుకోగా, అదే స్థలంలో రాత్రికి రాత్రే విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాటినుంచి దళితులు, ఇతరులకు మధ్య ఘర్షణలు తలెత్తాయి. ఈ క్రమంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. అయితే ఆదివారం ఉదయం విగ్రహం చూపుడువేలు ధ్వంసమైన సంగతి ఊరంతా పాకిపోయింది. దీంతో దళితులు పెద్ద ఎత్తున గుమిగూడి రామాయంపేట-దౌల్తాబాద్ రోడ్డుపై కంచె వేసి రాస్తారోకో నిర్వహించారు. దాదాపు 3 గంటలపాటు రహదారిని నిర్బంధించడంతో సీఐ వెంకటేష్, నలుగురు ఎస్ఐలు పోలీసు సిబ్బంది చేరుకుని సముదాయించారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో వాహనాలను దారి మళ్లించారు.

దోషులను శిక్షించేంత వరకు ధర్నా విరమించబోమని భీష్మించుకున్నారు. నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

జహీరాబాద్, ఏప్రిల్ 15: వేసవికాలంలో అగ్నిప్రమాదాలు జరుగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖ అధికారులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో అగ్నిమాపకశాఖ అధికారులు అగ్నిప్రమాదాలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అందులో భాగంగా వారు ఫైర్‌సేఫ్టీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంట్లో వంటగ్యాస్ వెలిగిస్తున్న క్రమంలో మహిళలు జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే అడవి ప్రాంతాల్లో ఎవరైన బీడీ తాగి పడవేస్తే అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యూనుస్, యాదగిరి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరికలు



ఖేడ్‌లో కాంగ్రెస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీఎంపీ సురేష్ షెట్కార్ తదితరులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 15: ఖేడ్ కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ, బహుజన ముక్తిపార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు దాదాపు 2వేల మంది వరకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎంపీ, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్‌ల సమక్షంలో కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ, జహీరాబాద్‌పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **హత్నూర:** మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన 15మంది మాజీ సర్పంచులు, 8మంది ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, ఇతర నాయకులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ గాంధీ భవన్‌కు తరలివెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● **తూప్రాన్:** మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో మాజీ జడ్పీటీసీ గంగుమల్ల సుమన, గంగుమల్ల విజయభాస్కర్‌రెడ్డి, నాగులపల్లి మాజీ సర్పంచు ఏశబోయిన శ్రీశైలంయాదవ్, మాజీ సర్పంచు గొల్లపల్లి నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● **చిలప్‌చెడ్:** మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వెంట సోమవారం పలువురు బీఆర్ఎస్ మండల నాయకులు గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరినవారిలో మండల ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి, వైస్ ఎంపీపీ విశ్వంభరస్వామి, తాజా మాజీ సర్పంచులు అజ్జమర్రి గ్రామ సర్పంచ్ పరుశురాం రెడ్డి, జగ్గంపేట సర్పంచ్ మాంతప్ప, గంగారం సర్పంచ్ మమతబాబు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఆత్మకమిటీ డైరెక్టర్ విజయమ్మ నాయకులు ఉన్నారు.

మోదీ నాయకత్వాన్ని బలోపేతం చేద్దాం

● పలు మండలాల్లో బీజేపీ ఇంటింటి ప్రచారం



జహీరాబాద్: చెన్నారెడ్డినగర్‌లో ప్రచారం చేస్తున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆలెభాస్కర్, తదితరులు

జహీరాబాద్, ఏప్రిల్ 15: మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్న నేపథ్యంలో బీజేపీని మరింత బలోపేతం చేద్దామని ఓబీసీ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఆలెభాస్కర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని చెన్నారెడ్డినగర్‌లో ఓబీసీ మోర్చా, బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు సంజయ్ ఘనాటే, సుధీర్‌బండారీ, జిల్లా నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బక్కయ్యగుప్త, శ్రీనివాస్‌గుప్త, అసెంబ్లీకన్వీనర్ జనార్దన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు విశ్వనాథ్‌స్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హత్నూర: బీజేపీ ప్రభుత్వంతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ అన్నారు. సోమవారం మహజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మురళీధర్‌యాదవ్ హత్నూరలోని 222బూత్‌లో, ఉపాధిహామీ కూలీలతో వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభుగౌడ్, బీజేపీ మండల నాయకులు నీరుడి అశోక్, చంద్రాగౌడ్, పండుగ రాజు, తదితరులు పాల్గొన్నారు.

● **జిన్నారం:** బొల్లారం మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సోమవారం పార్టీ మెదక్ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆనందకృష్ణారెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి, మేఘనారెడ్డి, మోహన్‌రావు తదితరులు పలు కాలనీల్లో తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

● **కొల్చారం:** మండలంలోని ఎనగండ్ల గ్రామంలో సోమవారం బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపికి ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కొల్చారం మండల బీజేపీ అధ్యక్షుడు పాతూరి దయాకర్‌గౌడ్, ఎనగండ్ల శక్తి కేంద్రం ఇన్‌చార్జి మన్నె సుభాష్, బూత్ అధ్యక్షులు ఒగ్గు మహేష్, మంగలి లింగం, కొరబోయిన శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేగుంటలో ఓటర్లకు అవగాహన

చేగుంట, ఏప్రిల్ 15: మెదక్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేగుంట తహసీల్దార్ గియాసున్నీసా బేగం ఆధ్వర్యంలో చేగుంట గాంధీ చౌరస్తా వద్ద సోమవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్ ఓటర్లు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్ యాదవ్, సర్వేయర్ రవీందర్ రెడ్డి. కానిస్టేబుళ్లు వెంకటేష్ , గట్టిషే, సిబ్బంది శ్రీనివాస్, లింగం, స్వామి, అంగన్‌వాడీ టీచర్లు , ఆశావర్కర్లు, ఓటర్లు పాల్గొన్నారు.

బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరిక



జోగినాథ్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న బీబీ పాటిల్

జోగిపేట, ఏప్రిల్ 15: జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా జోగినాథ్ గుప్తా సోమవారం బీజేపీలో చేరారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ పార్టీ కండువా కప్పి జోగినాథ్ గుప్తాను పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు అందోలు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు శేరి సంగారెడ్డి కూడా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు

బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థిని గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మారెడ్డి

పాపన్నపేట, ఏప్రిల్ 15: మెదక్ పార్లమెంటరీ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో జరిగిన బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో బీఆర్ఎస్ బలంగా ఉందని అందరు శ్రమిస్తే గెలుపు నల్లేరు మీద నడకేనని తెలిపారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మండల ఎన్నికల కో ఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, ఎలక్షన్ ఇంచార్జి శ్రీనివాస్ యాదవ్ నాయకులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో చైతన్య మహారాజ్ కీర్తన

నారాయణఖేడ్, ఏప్రిల్ 15: ఖేడ్‌పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మూడో రోజు సోమవారం కొనసాగాయి. సూర్యప్రభ వాహన సేవ, చైతన్య మహారాజ్ కీర్తనతోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను సాయంత్రం వరకు నిర్వహించారు. ఖేడ్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. మంగళవారం హంసవాహన సేవ ఉంటుందని ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు.

రాసోల్‌లో సీతారాముల విగ్రహ ప్రాణప్రతిష్ఠ



రాసోల్‌లో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

కంగ్టి, ఏప్రిల్ 15: మండల పరిధిలోని రాసోల్‌లో నూతనంగానిర్మించిన రామాలయంలో సోమవారం ఆలయ శిఖరోత్సవంతో పాటు సీతారామలక్ష్మణుల విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా ఆలయం వద్ద సప్తాహ కొనసాగుతున్నది. వేద మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహాల ప్రాణప్రతిష్ఠ జరిగింది. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

రాంపూర్‌లో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

అల్లాదుర్గం, ఏప్రిల్ 15: మండలంలోని రాంపూర్ శ్రీ పెద్దమ్మతల్లి పునః ప్రతిష్ఠాపనోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. మూడు రోజుల వేడుకలలో భాగంగా చివరి రోజైన సోమవారం తెల్లవారుజాము నుంచే గణపతి పూజ, స్వస్తివాచనం, విగ్రహప్రతిష్ఠ, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

ఆరూర్‌లో ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

సదాశివపేట, ఏప్రిల్ 15: మనస్తాపంతో ఉరేసుకుని బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండలంలోని ఆరూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మన్నె శివాని (17) ఇంటర్మీడియట్ పూర్తిచేసి చదువు మానేసి ఇంట్లోనే ఉంటున్నది. కొంత కాలంగా కుటుంబ సభ్యులతో అన్యమనస్కంగా ఉంటున్న శివాని తీవ్ర మనస్తాపంతో బాధపడుతున్నది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి మన్నె అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15: జిల్లా వ్యాప్తంగా ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓపెన్ పరీక్షలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి మే 2 వ తేదీ వరకు థియరీ పరీక్షలు, 3 వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో 2,388 మంది, ఇంటర్ పరీక్షలకు 4,297 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరగనున్నదని తెలిపారు. సమావేశంలో డీఆర్వో పద్మజారాణి, డీఈవో వెంకటేశ్వర్లు, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల పారిశ్రామిక విజ్ఞాన యాత్ర



విజ్ఞాన యాత్రలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 15: సంగారెడ్డిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఈఈఈ విద్యార్థులు సోమవారం పారిశ్రామిక విజ్ఞానయాత్రకు వెళ్లారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్ట్స్ సహకారంతో రుద్రారంలోని తోషిబాపవర్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్‌కు తీసుకెళ్లి అక్కడ అధునాతన సాంకేతికతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల సార్వజనిక వికాసానికి పారిశ్రామిక విజ్ఞాన యాత్రలు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ ఆనంద్‌కుమార్, అధ్యాపకులు దీప్తి, అరుణ్, అటెండర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టండి: ఎంఈవో

మునిపల్లి, ఏప్రిల్ 15: మండలంలోని ఆయా పాఠశాలలకు మంజూరైన నిధులతో పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలని ఎంఈవో దశరథ్ సూచించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లతో సోమవారం మండల కేంద్రమైన మునిపల్లి ఆదర్శ పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఏపీఎం బాగయ్య, ఏఈపీఆర్ మదుకర్, ఆయా పాఠశాలల హెచ్‌ఎం, ఎస్ఎంసి చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమనిర్మాణాలను తొలగించిన అధికారులు

జహీరాబాద్, ఏప్రిల్ 15: జహీరాబాద్ పట్టణంలోని రాచన్నపేటలో 173,174 సర్వేనెంబరుపై నాలాపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. నాలాను కుదించి నిర్మాణం చేపడుతున్న తీరును స్థానికులు, మాజీ కౌన్సిలర్ నామకిరణ్ తదితరులు మున్సిపల్, ఇరిగేషన్‌శాఖ అధికారులకు విన్నవించడంతో వారు ఎట్టకేలకు స్పందించి అక్రమనిర్మాణాన్ని తొలగించారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

హత్నూర, ఏప్రిల్ 15: దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పంచగామ పీఠాధిపతి కాశీనాథ్ బాబా పేర్కొన్నారు. సోమవారం హత్నూర మండలం పరిధిలోని నస్తీపూర్ రామాలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో కాశీనాథ్ బాబా పాల్గొని భక్తుల నిర్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో భక్తి మార్గంలోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. రెండు రోజులుగా ఈ ప్రతిష్ఠా మహోత్సవాలు కొనసాగుతున్నాయి. పూజా కార్యక్రమాల్లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం 75లక్షలు: ఎంపీపీ

జిన్నారం, ఏప్రిల్ 15: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం రూ.75లక్షలు మంజూరైనట్లు ఎంపీపీ రవీందర్‌గౌడ్ తెలిపారు. సోమవారం జిన్నారంలో మాట్లాడుతూ మండలంలోని 31 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు నీటి సౌకర్యం, టాయిలెట్స్, సాధారణ మరమ్మతులు కల్పించేందుకు రూ.75లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. గతంలో మన ఊరు - మన బడి పథకం కింద పనులు చేపట్టని ఇతర పాఠశాలల్లో ఈ నిధులు ఖర్చు చేసి త్వరలోనే వసతులు కల్పించనున్నట్లు ఎంపీపీ తెలిపారు.

గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలి

చిలప్‌చెడ్, ఏప్రిల్ 15: గ్రామాల్లో ఎక్కడా నీటిసమస్య రాకుండా చూసుకోవాలని ఎంపీడీవో ఆనంద్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో శ్యాంకుమార్, కార్యదర్శులు, ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.

రుద్రారంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 15 : రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. 1993-94 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత నేడు కలుసుకొని గత స్మృతులను నెమరువేసుకున్నారు. పరస్పర క్షేమసమాచారాలను పంచుకుని రోజంతా సందడి చేశారు.

ధర్మారంలో పెద్దమ్మతల్లి వార్షికోత్సవం



బోనాల ఉత్సవాల్లో ఆవులరాజిరెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 15: మండలంలోని ధర్మారంలో పెద్దమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి గ్రామంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠలో సునితారెడ్డి పూజలు

కొల్చారం, ఏప్రిల్ 15: మండల పరిధిలోని వరిగుంతం గ్రామంలో సోమవారం హనుమాన్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజారోహణం కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఎనగండ్లలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా జమదగ్ని, శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం జరిగింది. ఎమ్మెల్యే హాజరై సునీతారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.